క్లుప్తంగా

పారిశుధ్య కార్మికులకు సహకరించాలి



ఆరిలోవ కాలనీలో డ్రైడే ర్యాలీ చేపడుతున్న కార్పొరేటర్ సునీత, జెడ్సీ కనకమహాలక్ష్మి

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు శివాజీనగర్–2లో శుక్రవారం డ్రైడే ర్యాలీ జరిగింది. జోన్–2 కమిషనర్ కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో కార్పొరేటర్ కెల్ల సునీత, పారిశుధ్య కార్మికులు, మలేరియా విభాగం సిబ్బంది ఈ ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజలు ఇంట్లోనే తడి–పొడి చెత్తను వేరు చేసి జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు అందించి సహకరించాలని కోరారు. అందరూ ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలన్నారు. జెడ్సీ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. నీటి ట్యాంక్‌లో నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ మంగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బృందగాన పోటీలు



దేశభక్తి గీతాలు ఆలపిస్తున్న విద్యార్థులు

ఏయూ క్యాంపస్: భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ–ఝాన్సీ లక్ష్మీబాయి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏయూ అంబేడ్కర్ అసెంబ్లీ హాల్ వేదికగా జాతీయ దేశభక్తి బృందగాన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఎం.ముత్యాలనాయుడు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో అధిక సంఖ్యలో పాల్గొని ప్రతిభ కనబరిచారు.

ఎఫ్‌సీఐని సందర్శించిన కశ్మీర్ విద్యార్థులు



కశ్మీరీ విద్యార్థులకు ఎఫ్‌సీఐ గురించి వివరిస్తున్న ప్రిన్సిపాల్ రమణ

ఆరిలోవ: ఫుడ్‌క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌ను శుక్రవారం కశ్మీర్ విద్యార్థులు సందర్శించారు. అక్కడి ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న 120 మంది విద్యార్థులు సందర్శించి ఇక్కడ కోర్సుల గురించి తెలుసుకున్నారు. ఏయే కోర్సులు నేర్పుతున్నారు, వాటి బోధన, తదితర వాటి గురించి ఎఫ్‌సీఐ ప్రిన్సిపాల్ రమణ వివరించారు. అనంతరం ఇక్కడ వంటల పద్ధతులు కశ్మీర్ విద్యార్థులకు వివరించి వారి వంటల విధానం గురించి తెలుసుకున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట మహోత్సవం

మద్దిలపాలెం : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం పీతలవానిపాలెంలో శుక్రవారం రాట మహోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య ఉత్సవ రాట వేశారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణా యువజన సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు లగుడు రవికుమార్, హేమ దంపతులు ఆర్థిక సహాయం అందించారన్నారు. ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకూ వైభవంగా ఉత్సవాలను నిర్వహించడానికి అన్ని ఏర్పాటు చేయనున్నామన్నారు.

9 నుంచి స్థూలకాయ నివారణ శిబిరం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి స్థూలకాయ నివారణకు ప్రత్యేక యోగా శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కేంద్రం గౌరవ సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భానుకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 99854 56160, 94944 01919, 93980 19922 నంబర్లలో సంప్రదించాలి. తరగతులు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు.

గెడ్డల ఆధునికీకరణకు ప్రతిపాదనలు

- అధికారులకు ఎంపీ ఎంవీవీ ఆదేశాలు
- 22వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం



ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు హారతి పడుతున్న మహిళలు

బీచ్ రోడ్డు: శివాజీపాలెం పరిసర ప్రాంతాల్లోని గెడ్డల ఆధునికీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ జీవీఎంసీ 22వ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు కుళాయిల జంక్షన్‌లో ఎంపీ పర్యటించారు. శివాజీపాలెంలో ఉన్న గెడ్డల సమస్యను ఎంపీ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన ఆధునికీకరణ పనులకు సంబంధించి వెంటనే జీవీఎంసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సత్వరం ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ ఎంవీవీకి పూలమాలలు వేసి, హారతులు పట్టి ఘనంగా సత్కరించారు. అనంతరం శివాజీపాలెం పరిసర ప్రాంతాల్లో ఎంపీ గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల మంజూరే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గడప గడపకు వెళ్లి సంక్షేమం, అభివృద్ధి గురించి అడగగా.. ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఎంపీ చెప్పారు. వార్డులో 300 ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 10వ వార్డ్ ఇన్‌చార్జి జగ్గుపల్లి అప్పలరాజు, 21వ వార్డు అధ్యక్షుడు మధుపాడ రవికుమార్, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ జ్యోషిలా, పార్లమెంట్ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి బోండా శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పేర్ల విజయ్చందర్, వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి చొక్కర శేఖరరావు, ఎం.వి.వి.బాషా, సూరిబాబు, శశికళ, పైడి శ్రీను, పీతల మహేష్, ఒమ్మి శ్యాం, నిజాముద్దీన్, ఈశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

'ఎందుకు ఏపీకి జగనే కావాలి'పై ప్రచారం అవసరం

- ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ
- గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ

ఎంవీపీ కాలనీ: ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ఎందుకు కావాలో ప్రజలకు విస్తృతంగా వివరించాలని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని 20, 21, 28 వార్డుల గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లతో వెంకోజీపాలెంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. 11న ప్రారంభం కానున్న ఎందుకు ఆంధ్రప్రదేశ్‌కు జగనే కావాలి(వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి సీఎం జగన్ ఎందుకు కావాలో ప్రతి ఇంటికి తెలియజేయాలన్నారు. ప్రభుత్వంపై టీడీపీ, జనసేన పార్టీలు ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుడు పండుల రవీంద్రబాబు, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు కోలా గురువులు, స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గన్నమనేని వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, వార్డుల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి దృష్టికి ఉద్యోగుల సమస్యలు



ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డికి సమస్యలు వివరిస్తున్న ఎన్ఎంయూఏ అధ్యక్షుడు రమణారెడ్డి, తదితరులు

మద్దిలపాలెం : ఏపీఎస్ ఆర్టీసీ నూతన చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి దృష్టికి ఉద్యోగుల సమస్యల తీసుకువెళ్లామని నేషనల్ మజ్దూర్ అసోసియేషన్ యూనిటీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి తెలిపారు. ఆర్టీసీ చైర్మన్‌ను శుక్రవారం తాడేపల్లిలో కలిసి, సన్మానించారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వివరించామన్నారు. వీటిలో ప్రధానంగా ఆర్పీఎస్ 2017 అరియర్స్, లీవ్ క్యాష్ మంజూరు, ఇతర బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆయనకు వివరించారు. దీంతో స్పందించిన చైర్మన్ అబ్బిరెడ్డి ఆర్టీసీ యాజమాన్యంతో చర్చించి, ఉద్యోగులకు రావాల్సిన బకాయిల చెల్లింపు, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆలోచింపజేసిన సాంఘిక నాటికలు



నేరస్తుడు నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం : సమాజంలో అసమానతలను కళ్ల కట్టినట్టు ప్రదర్శించిన రెండు సాంఘిక నాటికలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నెలవారి నాటిక ప్రదర్శనలు శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలను కళాశాల భారతీ ట్రస్టీ బృందం ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ వీఆర్‌కే రాంబాబు, నాంచారయ్య, జత్‌రాయ్, డైరెక్టర్ శాస్త్రీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన శ్రీసప్తగిరీశం బృందం నాగభట్ల బాపన్న శాస్త్రి రచించి, దర్శకత్వం వహించిన నేరస్తులు సాంఘిక నాటికను ప్రదర్శించారు. నాటికలో ప్రతి సన్నివేశాన్ని ఎంతో ఆసక్తిగా ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. అనంతరం రెండో నాటికగా అదే బృందం నాగభట్ల బాపన్న శాస్త్రి రచన, దర్శకత్వంలో పున్నామ నకరం సాంఘిక నాటికను అద్భుతంగా ప్రదర్శించారు. ఈ నాటికలను తిలకించిన ప్రేక్షకులు కళాకారులకు కరతాళ ధ్వనులతో అభినందనలు తెలిపారు.

కృష్ణా కళాశాలకు డమ్మీ రైఫిల్స్ వితరణ



డమ్మీ రైఫిల్స్ అందుకున్న ఎన్‌సీసీ విద్యార్థులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌సీసీ యూనిట్‌కు లయన్స్ క్లబ్ ప్రతినిధులు 23 డమ్మీ రైఫిల్స్‌ను అందజేశారు. కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాతకు రూ.41,400 విలువైన 23 డమ్మీ రైఫిల్స్‌ను లయన్స్ క్లబ్ ట్రస్టీ దుర్గాప్రసాద్ అందించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులు స్వాతంత్య్ర, గణతంత్ర వేడుకల సమయంలో చేసే విన్యాసాలు, పరేడ్ ప్రక్రియలకు డమ్మీ రైఫిల్స్ ఎంతో అవసరమన్నారు. కళాశాల ఎన్‌సీసీ లెఫ్టినెంట్ బి.సన్యాసిరావు విజ్ఞప్తి మేరకు ఈ డమ్మీ రైఫిల్స్‌ను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు చంద్రశేఖర్, ప్రెసిడెంట్ మహేశ్ పాల్గొన్నారు.

బందోబస్తులో ఏఆర్ పోలీసుల పాత్ర కీలకం



పోలీస్ పరేడ్ పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ: బందోబస్తు, అత్యవసర సమయాలలో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్(ఏఆర్) పోలీసుల పాత్ర చాలా కీలకమని అనకాపల్లి జిల్లా ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో కైలాసగిరి ఏఆర్ పోలీస్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఇక్కడ ఏఆర్ పోలీసులు నిర్వహించే పరేడ్‌ను పరిశీలించారు. గ్రీవెన్స్‌లో అందిన సమస్యలను పరిష్కరిస్తామని పోలీసులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజుల్లో నిర్వహించనున్న స్మృతి పరేడ్‌కు తగిన సాధన చేయాలని సూచించారు. ఇటీవల ఎస్ఐ ఉద్యోగాల కోసం ఇక్కడ నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలను సిబ్బంది విజయవంతం చేశారని, వారి సేవలను కొనియాడారు. ఈ పర్యటనలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, పరేడ్ కమాండర్ వెంకటరావు, ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారావు, వెంకటరావు, సతీష్, అరవింద్ కిశోర్, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

'త్వరగా విమానాశ్రయం పునరుద్ధరణ పనులు'

ఎంవీపీ కాలనీ: బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు శుక్రవారం ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ని కలిశారు. ఈ సందర్భంగా విశాఖ విమానాశ్రయం పునరుద్ధరణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కోరుతూ మంత్రికి వినతిపత్రం అందజేశారు. నవంబర్ 15 నుంచి ఏప్రిల్ 2024 వరకు రాత్రిపూట రన్ వే మూసివేస్తూ విమానాశ్రయ అధికారులు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో 4 నెలల రన్‌వే మూసివేస్తే వ్యాపార లావాదేవీలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని రక్షణ మంత్రికి వివరించినట్టు జీవీఎల్ తెలిపారు. ఈ నేపథ్యంలో పనులు త్వరితగతిన పూర్తిచేసేలా ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.

'పార్టీని నమ్ముకుంటే సముచిత స్థానం'



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

మద్దిలపాలెం : వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా నియామకమైన మారిశెట్టి నాగేశ్వరరావును శుక్రవారం ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ శివాజీపాలెంలో తన నివాసంలో సత్కరించారు. పార్టీని నమ్ముకుని కష్ట పడి పని చేసే వారికి సముచిత స్థానం లభిస్తుందని వంశీకృష్ణ చెప్పారు. జిల్లా కార్యవర్గం కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కనకరాజు, వెంకటలక్ష్మి, జార్జ్ రాజు, నాని, సత్య, తదితరులు పాల్గొన్నారు.

జూలో కొత్త ఆడ సింహం



ఎన్‌క్లోజర్‌లోకి విడిచిపెట్టిన ఆడ సింహం

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో కొత్త ఆడ సింహం సందర్శకులను అలరించనుంది. ఇటీవల ఇక్కడ సందర్శకులను అలరించే ఓ ఆడ సింహం మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఇక్కడ ఎన్‌క్లోజర్‌లో ఆడ సింహం లేకుండాపోయింది. దీంతో బోసిపోయిన ఈ ఎన్‌క్లోజర్‌లోకి జూ అధికారులు మరో ఆడ సింహాన్ని విడిచిపెట్టారు. ఈ ఏడాది ఆగస్టు 19న గుజరాత్‌లో సక్కర్‌బాగ్ జూ పార్కు నుంచి తీసుకొచ్చిన రెండున్నరేళ్ల వయసు గల ఆడ సంహాన్ని ఇంతవరకు ఇక్కడ క్వారెంటైన్‌లో ఉంచారు. క్వారెంటైన్ కాలం పూర్తికావడంతో శుక్రవారం సీసీఎఫ్ శ్రీకంఠనాథరెడ్డి ఈ ఆడ సింహాన్ని జూలో సింహాల ఎన్‌క్లోజరులో విడిచిపెట్టినట్టు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు.

నగరంలో కార్డన్ సెర్చ్

- సరైన ధ్రువపత్రాలు లేని 31 బైక్‌లు సీజ్



తనిఖీ చేస్తున్న పోలీసులు

దొండపర్తి : నేర నియంత్రణలో భాగంగా పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పీఎం పాలెం, టూటౌన్, మహారాణిపేట పోలీస్‌స్టేషన్ల పరిధి పలు ప్రాంతాలను జల్లెడ పట్టారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాలతో డీసీపీ–1 కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 150 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది గురువారం అర్ధరాత్రి, శుక్రవారం తెల్లవారు జామున మారికవలస, కొబ్బరితోట, సాలిపేట ప్రాంతాల్లో ఒకే సమయంలో క్షుణ్ణంగా తనిఖీ లు నిర్వహించారు. ఇందులో సరైన ధ్రువపత్రా లు లేని 31 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.

రూ.12 లక్షల బంగారు ఆభరణాల చోరీ

- పీఎంపాలెం ఆర్‌హెచ్ కాలనీలో ఘటన

పీఎంపాలెం: స్థానిక ఆర్‌హెచ్‌కాలనీలో సుమారు రూ.12 లక్షల విలువ గల ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పీఎంపాలెం క్రైం ఇన్‌చార్జి సీఐ రమేష్ తెలిపిన వివరాలివీ.. ఆర్‌హెచ్ కాలనీలోని ఇంటి నంబర్ 7–23లో కె.ధనుంజయరావు తన భార్య స్వర్ణలత, కుమార్తెలతో కలిసి నివసిస్తున్నారు. అతని భార్య అనారోగ్యానికి గురికావడంతో గత శుక్రవారం నగరంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అతను భార్యకు తోడుగా ఆస్పత్రిలోనే ఉన్నారు. కుమార్తెలు ఇంటిని కనిపెట్టుకుంటూ రాత్రి వేళల్లో సమీపంలోని బంధువుల ఇంటి వద్ద నిద్రపోతున్నారు. కాగా.. శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో ధనుంజయరావు ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలిపారు. వెంటనే వారు వెళ్లి చూడగా.. బెడ్‌రూమ్‌లోని నగలు భద్రపరిచిన బీరువా తెరిచి ఉంది. గదిలో వస్తువులు, దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని బంగారు హారం, నక్లెస్, నాలుగు గాజులు, చెవి కమ్మలు, ఎత్తు గొలుసులు, ఉంగరాలు, స్టెప్ గొలుసు, కాళ్ల పట్టీలు తదితర రూ.12 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు చోరీకి గురయినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న ఏడీసీపీ నాగన్న, క్రైం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్‌ను రప్పించారు. కుటుంబ సభ్యులను విచారించారు. బాధితుడు ధనుంజయరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

విద్యతోనే అభివృద్ధి

- ప్రవాస భారతీయుడు దేవ దాలయ్య
- ఏయూ సందర్శన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్యులు, దాలయ్య కుటుంబ సభ్యులు

ఏయూ క్యాంపస్: విద్య.. వ్యక్తి అభ్యున్నతికి, కుటుంబ స్థితిగతులను మార్చడానికి ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని మారిషస్‌లో స్థిరపడిన భారతీయుడు దేవ దాలయ్య అన్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి ఆయన శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విశాఖ నుంచి మారిషస్‌కు వలస వెళ్లిన తమ పూర్వీకుల సంగ్రహ జీవిత ప్రస్థానాన్ని వివరిస్తూ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవ్ దాలయ్య మాట్లాడుతూ 1865లో తమ పూర్వీకులు విశాఖ నుంచి మారిషస్‌కి ఓడలో వలస వెళ్లిన విధానం.. అక్కడ స్థిరపడి అభివృద్ధి సాధించిన పరిస్థితులను వివరించారు. నేడు తమ కుటుంబ సభ్యులు ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో స్థిరపడి, విద్య, వైద్య, న్యాయ, వ్యాపార, రాజకీయ రంగాలలో రాణిస్తున్నారని చెప్పారు. దీనంతటికీ ప్రధాన కారణం విద్య అని తాను ప్రగాఢంగా విశ్వసిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో దాలయ్య కుటుంబ సభ్యుడు రాజన్న దాలయ్య, పుస్తక సహ రచయిత ప్రదీప్ సేన్, ఏయూ జర్నలిజం విభాగ ఆచార్యుడు డి.వి.ఆర్.మూర్తి, అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఈ.ఎన్.ధనుంజయ రావు, తదితరులు పాల్గొన్నారు.

వీసీ ప్రసాదరెడ్డితో భేటీ

అనంతరం దాలయ్య కుటుంబ సభ్యులు ఏయు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డితో సమావేశం అయ్యారు. స్టార్టప్ రంగంలో కలిసి పని చేసే దిశగా ముందుకు రావాలని వీసీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఏయూ ఆ–హబ్ సీఈవో రవి ఈశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులు పునః ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



రామకృష్ణాపురం గెడ్డపై బ్రిడ్జి నిర్మాణం కోసం తవ్విన కల్వర్టు

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో బిడ్జి పనులు పునః ప్రారంభమయ్యాయి. కంబాలకొండల నుంచి వచ్చిన పెద్ద గెడ్డ ఈ గ్రామం మధ్యలో చెరువులో కలిసి అక్కడి నుంచి ముడసర్లోవ రిజర్వాయరులో కలుస్తుంది. గ్రామంలో ఈ గెడ్డపై కొన్నాళ్ల క్రితం నిర్మించిన కల్వర్టు చిన్నది(ఎత్తు తక్కువ) కావడంతో వర్షాలు కురిసినప్పుడు కొండల పైనుంచి వచ్చిన వరద నీరు ఇక్కడ పోటెత్తుతోంది. ఆ నీరు పొంగిపోయి ఈ కల్వర్టు పైనుంచి గ్రామంలో ఇళ్లలోకి చేరుతుంది. గ్రామస్తులు ఈ సమస్య నుంచి బయటపడాలనే ఆలోచనతో అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడ కల్వర్టు తొలగించి రూ.36.50 లక్షలు నిధులతో బ్రిడ్జి నిర్మాణం కోసం గతేడాది నవంబరులో పనులు ప్రారంభించారు. శంకుస్థాపన చేసిన తర్వాత కాంట్రాక్టర్ జాడ కనిపించలేదు. దీనిపై ఇటీవల సాక్షిలో 'కనిపించని కాంట్రాక్టర్' శీర్షికతో ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ అధికారులు స్పందించారు. కాంట్రాక్టర్‌ను పిలిపించి పనులు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు సదరు కాంట్రాక్టర్ ఇక్కడ రెండు రోజులుగా బ్రిడ్జి పనులు చేపడుతున్నారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతతో త్వరగా పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఎస్‌జీఎఫ్ షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలు నేడు

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు, ఎంపికలను శనివారం నిర్వహించనున్నట్లు అనకాపల్లి ఎస్‌జీఎఫ్ కార్యదర్శి ఎం.వి.నాగేశ్వరరావు తెలిపారు. అండర్–14 బాలురు, బాలికల విభాగాల పోటీలు, ఎంపికలు పరవాడ జేఎస్ఎన్‌యూఆర్ఎం కాలనీలోని ఇండోర్ స్టేడియంలో, అండర్ 17 బాలురు బాలికల పోటీలు, ఎంపికలు బోనంగిలోని సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆవరణల్లో చేపట్టనున్నట్లు తెలిపారు.

10న యోగా పోటీలు : ఎస్‌జీఎఫ్ ఉమ్మడి విశాఖ స్థాయి యోగా పోటీలు, ఎంపికలు ఈ నెల 10వ తేదీన పరవాడ మండలం ధర్మారాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్టు మండల కో–ఆర్డినేటర్ లోవరాజు తెలిపారు. బాలురు, బాలికలకు అండర్ 14, 17 విభాగాల్లో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. పోటీల అనంతరం రాష్ట్ర పోటీల్లో పాల్గొనున్న జట్ల ఎంపిక చేపడతామని తెలియజేశారు.

ఏయూ సమాచారం..

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రెండో రోజు కూడా వైద్య శిబిరానికి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. గురువారం ఉదయం ఈ శిబిరాన్ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ సందర్శించారు. ఉద్యోగులకు, విద్యార్థులకు అందిస్తున్న వైద్య పరీక్షలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఆయన పలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. న్యూట్రిషన్ ఫోకస్డ్ ఫిజికల్ ఎగ్జామినేషన్ విధానంలో ఎటువంటి రక్త పరీక్షలు నిర్వహించకుండా వ్యక్తి ఆరోగ్యాన్ని పరీక్షించి తగిన సూచనలు వైద్యులు, పోషకాహార నిపుణులు అందించారు. రెండు రోజుల్లో నిర్వహించిన ఈ శిబిరానికి 200 మంది బోధన సిబ్బంది, సుమారు 250 మందికిపైగా విద్యార్థులు హాజరై ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో లీ హెల్త్ డొమైన్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎ.లీలా రాణి, ఆచార్య ఎ.కె.ఎం.పవార్ పాల్గొన్నారు.

రెడ్డి అరుణకు ఏయూ డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగం పరిశోధక విద్యార్థిని రెడ్డి అరుణకు వర్సిటీ డాక్టరేట్ లభించింది. ఈ మేరకు వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి నుంచి ఆమె గురువారం ఉదయం ఉత్తర్వులు స్వీకరించారు. విభాగ ఆచార్యులు టి.షారోన్‌రాజు పర్యవేక్షణలో ఏ స్టడీ ఆఫ్ టెక్నోఫోబియా ఇన్ ద యూజ్ ఆఫ్ ఐసీటీ ఎమాంగ్ సెకండరీ స్కూల్ టీచర్స్ ఇన్ విజయనగరం డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. విజయనగరం జిల్లాలో పని చేస్తున్న హైస్కూల్ ఉపాధ్యాయుల్లో ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ(ఐసీటీ) వినియోగంలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వారి సంసిద్ధత అంశంపై ఆమె పరిశోధన జరిపారు. జిల్లాలో పని చేస్తున్న 500 మంది ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరించి, విశ్లేషణ చేశారు. ఈ సందర్భంగా అరుణను విభాగ ఆచార్యులు, పరిశోధకులు అభినందించారు.

బాలికా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కిడ్స్ క్రియేట్ పాఠశాల విద్యార్థులు తీర్చిదిద్దిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సమాజంలో బాలికల ప్రాధాన్యతను తెలిపేలా ఈ నెల 10న ర్యాలీ నిర్వహించనున్నట్లు పాఠశాల ఇన్‌చార్జి రొటేరియన్ మోదాంబిక తెలిపారు.

టైం స్కేల్ వర్తింపునకు వినతి

ఎంవీపీ కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం 28 రోజులు, ఎన్ఎంఆర్, కన్సాలిడేటెడ్ ఉద్యోగులు విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకెళ్లారు. చాలా ఏళ్లుగా వర్సిటీలో తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాలు నిర్వర్తిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో తమకు టైం స్కేల్ వర్తింపజేసేలా కృషి చేయాలని ఎంపీని కోరారు. త్వరలోనే ఈ సమస్యను ఏయూ వీసీ దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.